క్లుప్తంగా

'భూభారతి'కి దరఖాస్తుల వెల్లువ



దుగ్గొండి : మండలంలో భూభారతి సదస్సులకు సోమవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. తిమ్మంపేట, మహ్మదాపురం గ్రామాల్లో నిర్వహించిన సభలకు రైతులు వందలాదిగా చేరుకుని దరఖాస్తులు అందజేయడానికి పోటీ పడ్డారు. దీంతో దరఖాస్తుల స్వీకరణ గందరగోళంగా మారింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. తిమ్మంపేటలో 220, మహ్మదాపురంలో 168 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్లు ఉమారాణి, రాజేశ్వర్‌రావు, ఆర్‌ఐలు రాంబాబు, మల్లయ్య, సిబ్బంది అనిత, రాజ్‌కుమార్, మురళి, శరత్, రంజిత్, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



వర్ధన్నపేట : పట్టణంలో కాంగ్రెస్ నాయకుడు వడ్లకొండ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన అతడి కుమారుడు సాయిచరణ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం సాయిచరణ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, నాయకులు దొమ్మాటి భానుచందర్, సమ్మెట సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆవిర్భావ సభలో ఆయన్ను నియమించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి రాజకీయ ఎజెండాతో పార్టీ ఏర్పాటైందని చెప్పారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు సహకరించాలని కోరారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాంబాబు



నల్లబెల్లి : స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పాండవుల రాంబాబు ఎన్నికయ్యారు. స్థానిక పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో సోమవారం ఎన్నిక నిర్వహించగా ఎన్నికల అధికారిగా రావుల రవి వ్యవహరించారు. అధ్యక్ష పదవికి రాంబాబుతోపాటు పప్పు మొగిలి పోటీ పడగా 39 ఓట్ల మెజార్టీతో రాంబాబు గెలిచారు. ఉపాధ్యక్షుడిగా పిట్టల ప్రవీణ్, కార్యదర్శిగా జక్కుల కుమార్, కోశాధికారిగా గుండాల కుమారస్వామితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల్లో 12 ఏళ్లుగా తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో సోమవారం సమ్మేళనం నిర్వహించారు. నాటి తరగతి గదులను సందర్శించి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగితేలారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు ఉమాశంకర్, శ్రీనివాస్, సాయిలులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పెంచాల సతీశ్, నన్నె నరేశ్, పొన్నం అశోక్, ఇనుముల కిశోర్, శివ, మహేశ్, మహేందర్, మధుసూదన్‌రెడ్డి, ప్రకాశ్, నాగరాజు, రంజిత్, రాణి తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు

సంగెం : వేర్వేరు ఘటనల్లో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామచంద్రాపూరంలో చిదురాల సంపత్ కుటుంబాన్ని దూషించి దాడి చేసిన క్రమంలో అతని సోదరుడు చిదురాల సుధాకర్, భాగ్యమ్మ, ప్రవీణ్, అఖిల్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే లోహితలో బొడ్డుపల్లి వెంకట్రాజం కుటుంబ సభ్యులపై రాళ్లు, ఇనుప రాడ్‌లతో దాడి చేసి గాయపర్చిన బొడ్డుపల్లి కొమురయ్య, సమ్మక్క, సంతోశ్, ప్రశాంత్, రాణిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నిర్మాణం నాసిరకం

● పల్లె దవాఖానాలో సమస్యలు

నర్సంపేట రూరల్ : మండలంలోని మహేశ్వరంలోని పల్లె దవాఖానా నిర్మాణంలో నాణ్యతాలోపం చోటు చేసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనం ప్రారంభించిన ఏడాదిన్నరకే మరమ్మతులు చేయించాల్సిన దుస్థితి నెలకొనడం గమనార్హం. వర్షానికి స్లాబ్‌పై నీరు నిలుస్తుండగా భవనంలోని గదుల్లో బండలు కుంగిపోయి వైద్యసిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు కిందపడి గాయాలపాలవుతున్న పరిస్థితి నెలకొంది. భవనం శిథిలమవుతున్న క్రమంలో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని భవన మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వం గ్రామంలో పల్లె దవాఖానా నిర్మాణానికి రూ.16 లక్షలు ఎన్‌హెచ్‌ఎం నిధుల్లోంచి కేటాయించింది. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణం చేపట్టారు. కనీసం నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. భవనంపైన వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వేయించినా నల్లా సౌకర్యం కూడా కల్పించలేదు. పనులు పూర్తి స్థాయిలో ముగించక ముందే అప్పగించడంతో 2013 అక్టోబర్‌లో అధికారులు హడావుడిగా భవనాన్ని ప్రారంభించారు. అధికారులు పనులు పూర్తి కాకపోవడాన్ని సైతం పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. కాగా భవనాన్ని ప్రారంభించి 20 నెలలు కూడా గడవక ముందే గదుల్లో వేసిన బండలు కుంగిపోయాయి. వర్షం కురిస్తే గోడల్లోంచి నీరు ఉరుస్తోంది. అలాగే నీటి, ఇతర వసతులు కల్పించకపోవడంతో వైద్యసిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లను వినియోగించలేని దుస్థితి చోటు చేసుకుంది. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు మరమ్మతులు చేయించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పనులన్నీ సత్వరమే పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గ్రామంలోని పల్లె దవాఖానా ఆస్పత్రి



నిరుపయోగంగా ఉన్న సంపు

ఇబ్బందులు తప్పడం లేదు



ఆస్పత్రికి వైద్యం కోసం వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సదుపాయం లేదు. గదుల్లోని బండలు కుంగిపోవడంతో కాలుజారి పలువురు పడిపోయారు. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. భవన నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం స్పష్టంగా కనపడుతోంది. భవనానికి మరమ్మతులు చేయించాలి.

-గాండ్ల నారాయణ, గ్రామస్తుడు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నర్సంపేట : ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని 2, 16వ వార్డుల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ క్రమంలోనే పేదలకు రూ.5 లక్షలతో సొంతింటి కల సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోందని తెలిపారు.

వర్ధన్నపేట : మండలంలోని కాశగూడెంలో ఇళ్ల నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ముగ్గు పోసి మాట్లాడారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న, సతీష్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కొండేటి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందలో..

మండలంలోని ఇల్లందలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం సమ్మయ్య, నాయకులు ముగ్గు పోసి మాట్లాడారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు, ఐనవోలు ఆలయ కమిటీ సభ్యుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : ముగ్గు పోస్తున్న వెంకటయ్య



పర్వతగిరి : నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పర్వతగిరి : మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శంకర్‌నాయక్ పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిర్మాణాలకు అనుగుణంగా ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో డబ్బు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి మాధవుడు, కారోబార్ మేడిశెట్టి కరుణాకర్, కంప్యూటర్ ఆపరేటర్ షబానా, సురేశ్, బాసాని రామస్వామి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల వినియోగంతో నష్టం

● కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ హారిక

వర్ధన్నపేట : రైతులు అధికంగా రసాయనాలు వినియోగిస్తే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వరంగల్ వ్యవసాయ కళాశాల ఉద్యాన విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ యం.హారిక తెలిపారు. మండలంలోని బండౌతాపురంలో సోమవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, పంటల మార్పిడి, సమగ్ర చీడపీడల యాజమాన్యం, ఇంకుడు గుంతలతో నీటి సేకరణ, తదితర అంశాలపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ వరిలో కలుపు యాజమాన్యం, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విస్తరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.స్వామి మాట్లాడుతూ రైతులు వరిలో సాగు చేయగలిగిన వివిధ రకాల గురించి తెలిపారు. యూరియా తక్కువ వినియోగంతో పంటలకు కలిగే లాభాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ టి.మురళి, హెచ్‌ఎం శేఖర్, ఎస్జీటీలు శ్రవణ్‌కుమార్, ఆమని, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ హారిక

ఘనంగా ఉర్సు



నర్సంపేట : పట్టణంలోని హజ్రత్ సయ్యద్ జమాలే బహర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అన్నదానం, బయాన్, ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి జామే మజీద్ నుంచి ఖందిల్ ఊరేగింపు ఊరేగించారు. తదనంతరం దువా, ఫాతిహా (పూజ) కార్యక్రమాలు చేపట్టారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఆరు దశాబ్దాలపాటు సాగిన పోరాటాల్లో అనేక మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం అమరుల కుటుంబాలను, ఉద్యమకారులను విస్మరించిందని తెలిపారు. అమరుల కుటుంబాలకు పెన్షన్‌తోపాటు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటి రాంచందర్, జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్, చిల్లి రాజేంద్రప్రసాద్, డివిజన్ నాయకుడు బొనగాని రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిశాల రాజేశ్, నాయకులు బందెల సదానందం, చిర్ర శ్రావణ్‌కుమార్, సోల్తి సాయికుమార్, మహ్మద్ అలీ, తాళ్లపెల్లి సాంబలక్ష్మి, కోరె లక్ష్మి, బి.సంధ్యారాణి, మహబూబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన

● జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్

నర్సంపేట/వర్ధన్నపేట/పర్వతగిరి/ఖానాపురం/నెక్కొండ/దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన అందుతుందని జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, తహసీల్దార్లు విజయ్‌సాగర్, రాజ్‌కుమార్, ఎంపీడీఓలు మాలోతు శంకర్‌నాయక్, సునీల్‌కుమార్, వెంకటరమణ, ఎంఈఓలు మామునూరు శ్రీధర్, రత్నమాల, గాయపు లింగారెడ్డి, శ్రీదేవి అన్నారు. ఆయా మండలాల్లో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలతోపాటు యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, తదితర సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను చదువులతోపాటు ఆటపాటల్లో, ఇతర అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, హెచ్‌ఎంలు వెంకటరమణారెడ్డి, శోభ, బ్యులా బెట్రీస్, రంగారావు, పాక రమేశ్ బాబు, సాంబయ్య, రవికుమార్, రామస్వామి, జ్యోతిలక్ష్మి, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : మాట్లాడుతున్న శ్రీనివాస్



ఖానాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీల్



వర్ధన్నపేట : మాట్లాడుతున్న తహసీల్దార్

'వార్డుల విభజన లోపభూయిష్టం'

నర్సంపేట : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వార్డుల విభజన లోపభూయిష్టంగా ఉందని ఎంసీపీఐ(యూ) నాయకులు కన్నం వెంకన్న, వంగల రాగసుధ, కొత్తకొండ రాజమౌళి ఆందోళన వెలిబుచ్చారు. ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొన్ని గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయగా ఆయా గ్రామాల ఓటర్లను రెండు, మూడు వార్డుల్లో కలిపి ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. గ్రామాల విలీనంతో పేదలు ఉపాధి కోల్పోగా మరింత ఇబ్బందుల పాల్జేసేలా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక జ్యోతిబసునగర్, కార్ల్ మార్క్స్ కాలనీలో అనేక ఏళ్లుగా సమస్యలతో పేదలు సతమతమవుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. ఇకనైనా కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాషుక్, నాయకులు బైరబోయిన నర్సయ్య, బెజ్జంకి పుష్పలీల, విజయ తదితరులున్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైద్యశిబిరం



నల్లబెల్లి : మండలంలోని లెంకాలపల్లిలో నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ జయపాల్‌రెడ్డి పలువురు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లను వైద్య సిబ్బందితో కలసి ఆయన సందర్శించి వైద్యం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయపాల్‌రెడ్డి మాట్లాడారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనారోగ్యం తలెత్తితే వెంటనే వైద్యం చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కోమల, సూపర్‌వైజర్ హెప్సీబా, కిషన్, ఆశ వర్కర్లు రమ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

పర్వతగిరి : బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని ఏనుగల్‌కు చెందిన పైండ్ల సంపత్, కల్లెపు రాకేశ్ ప్రయాణిస్తున్న బైక్ స్థానిక శ్రీరాజన్న వైన్స్ షాప్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సంపత్, రాకేశ్‌లను స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు.

రాజ్యాంగ పరిరక్షణ సామాజిక బాధ్యత

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివ

నర్సంపేట : భారత రాజ్యాంగ పరిరక్షణను సామాజిక బాధ్యతగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీరెడ్డి సాంబశివ అభివర్ణించారు. పట్టణంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు సాంబయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బూర్జువా పాలకుల తీరుతో రాజ్యాంగం సంక్షోభంలో కూరుకుపోతోందని ఆందోళన వెలిబుచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడచినా పేదలు, సామాన్యులకు ఫలాలు అందడం లేదన్నారు. బూర్జువా పెట్టుబడిదారులు, కార్పొరేట్ పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందుతూ మరింత సంపన్నులవుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలతో లౌకికవాదానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. కులం పేరుతో దళితులపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. సమాజంలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుండడంతో రిజర్వేషన్లు అందక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోందని తెలిపారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై శ్రేణులు నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ప్రజల్లో ఉంటూ సమస్యలపై చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్మిస్తూ పరిష్కారానికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, భూక్య సమ్మయ్య, నమిండ్ల స్వామి, హన్మకొండ శ్రీధర్, ఆరూరి కుమార్, సాంబయ్య, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

'ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి'

నెక్కొండ : దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి నర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మరిపెల్లి మొగిలి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఈదునూరి కవిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం సుమారు 20 మంది ఎంసీపీఐ(యూ)లో చేరారు. వారికి నర్సయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లి ప్రతాప్, బానోత్ లాలు, బానోత్ చంద్రు, ఈదునూరి ప్రవళి, బిర్రు యాకలక్ష్మి, కుక్కల రజిత, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నర్సయ్య, నాయకులు

'డీఎస్‌ఆర్ అటెండెన్స్ నిబంధన ఎత్తివేయాలి'



ఎంపీడీఓ కృష్ణవేణికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గీసుకొండ : డైలీ సైట్ రిపోర్ట్ (డీఎస్‌ఆర్) అటెండెన్స్ నిబంధన ఎత్తివేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కృష్ణవేణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌రావు, నాయకులు మాట్లాడారు. ఫేస్ అటెండెన్స్‌తో మహిళా పంచాయతీ కార్యదర్శుల సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామ పంచాయతీ పాలక వర్గాలు లేని కాలంలో చేపట్టిన పనులకు సంబంధించిన డబ్బుల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సునీత, కల్యాణి, శారద, హేమలత, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, ప్రవీణ, సరిత, మహేశ్, అనిల్, చిత్తరంజన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వడ్డే వీరయ్య, 13వ వార్డులో జూలూరి కొమురయ్య సోమవారం వేర్వేరుగా మృతి చెందగా వారి మృతదేహాలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీరయ్య కుమారుడైన వార్డు కమిటీ ఇన్‌చార్జ్ కుమారస్వామిని పరామర్శించారు. కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేశ్, పేరం బాబురావు, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేరుగు సాంబయ్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాబా, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

హత్య కేసు నిందితులను గుర్తించని పోలీసులు?

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 17వ డివిజన్ స్తంభంపల్లిలో వృద్ధురాలి హత్య కేసు నిందితులను రెండు రోజులు గడిచినా పోలీసులు గుర్తించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. స్తంభంపల్లి గ్రామంలో పోచన స్వరూప (69)అనే వృద్ధురాలిని ఆదివారం తెల్లవారుజామున దారుణంగా డంబెల్స్‌తో మోది హత్య చేసిన విషయంలోనూ పోలీసు శాఖ నిఘా వైఫల్యమే అని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్వరూపను హత్య చేసి ఆమె మెడలో ఉన్న రెండున్నర బంగారు పుస్తెల తాడుతోపాటు చెవికమ్మలను దోచుకుని వెళ్లారని, వాటి విలువ సుమారు రూ. 2.10 లక్షలు ఉంటుందని స్థానిక సీఐ మహేందర్ చెప్పినట్లు తెలుస్తోంది. బీరువా తెరిచి అందులోని రూ. 10 వేల నగదును దోచుకుని వెళ్లారని సీఐ చెప్పినట్లు చెబుతున్నారు. ఈ కేసులోని నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటుచేసినట్లు సమాచారం. కానీ పోలీసులు ఆ విషయాన్ని అధికారికంగా చెప్పడం లేదు. గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట పెట్రోలింగ్ లేకపోవడంతో ఈ దారుణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.